శ్రీరామ

M.S. Nabhudu
Bhattiprolu

శ్రీ ర స్తు
శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

కృష్ణ శతకము

క. శ్రీరుక్మిణీశ! కేశవ
నారద సంగీతలోల! నగధర శౌరీ!
ద్వారక నిలయ జనార్ధన!
కారుణ్యము తోడ మమ్ముఁగావుము కృష్ణా! 1

క. నీవే తల్లివి తండ్రివి
నీవే నాతోడు నీడ, నీవే సఖుఁడౌ
నీవే గురుఁడవు, దైవము
నీవే నాపతియు గతియు, నిజముగ కృష్ణా! 2

క. నారాయణ! పరమేశ్వర!
ధారాధర నీలదేహ! దానవవైరీ!
క్షీరాబ్ధి శయన! యదుకుల
వీరా! ననుఁగావు కరుణ, వెలయఁగ కృష్ణా! 3

క. 'హరి' యను రెండక్షరములు
హరియించును పాతకముల, నంబుజనాభా!
హరి నీ నామ మహాత్త్వము
హరిహరి! పొగడంగ వశమె హరి! శ్రీకృష్ణా! 4

క. క్రూరాత్ముఁడ జామిళుఁడు
'నారాయణ' యనుచు నాత్మ, నందను బిలువ
న్నేరీతి నేలుకొంటివి?
మేరీ నీ సాటివేల్పు, లెందును గృష్ణా 5

క. చిలుక నొక రమణి ముద్దుల
చిలుకను శ్రీరామ యనుచు, శ్రీపతి పేరన్
బిలిచిన మోక్షము నిచ్చితి
వలరఁగ మిముఁ దలచు జనుల, కరుదా కృ. 6

క. అక్రూరవరద, మాధవ
చక్రాయుధ! ఖడ్గపాణి శౌరి ముకుందా!
శక్రాది దివిజ సన్నుత!
శుక్రార్చిత, నన్నుఁ గరుణఁ జూడుము కృ. 7

క. నందుని ముద్దుల పట్టివి,
మందర గిరిధరునిఁ హరుని, మాధవు విష్ణున్
సుందర రూపునిఁ మునిగణ
వందిత నినుఁదలతు భక్తవత్సల కృ. 8

క. ఓ కారుణ్య పయోనిధి!
నాకాధారంబ వగుచు నయముగ బ్రోవన్
న్నా కేల యితర చింతలు
నాకాధిప వినుత! లోక నాయక కృ. 9

క. వేదంబులు కన నేరని
యాది పరబ్రహ్మమూర్తి వనఘ! మురారీ,
నా దిక్కుఁజూచి కావుము,
నీ దిక్కే నమ్మినాఁడ నిజముగ కృ. 10

క. పదునాలుగు భువనంబులు
కుదురుగ నీ కుక్షి నిల్పుకొను నేర్పరివే
విదితంబుగ నా దేవకి
యుదరములో నెట్టులొదిగి యుంటివి? కృ. 11

క. అష్టమి రోహిణి ప్రొద్దున
నష్టమ గర్భమునఁ బుట్టి యా దేవకికిన్,

దుష్టుని గంసు వధింపవె
సృష్టి పరిపాలనంబు సేయఁగ కృ. 12

క. అల్ల జగన్నాథుకు వ్రే
పల్లియ క్రీడార్థమయ్యె, బరమాత్మునకున్
గొల్లసతి యా యశోదయుఁ
దల్లియునై చన్నుఁ గుడిపెఁ దనరగ కృ. 13

క. అందెలు గజ్జెలు మ్రోయఁగ
జిందులు ద్రొక్కుచును వేడ్క చెలువారంగా
నందుని సతి యా గోపిక
ముందట నాడుదువు మిగుల, మురియుచుఁ కృ. 14

క. హరి చందనంబు మేనునఁ గర
మొప్పెడు హస్తములనుఁ గంకణ రవముల్
ఉరమున రత్నము మెరయఁగఁ
బరగితివో, నీవు బాల ప్రాయము! కృ. 15

క. పాణి తలంబున వెన్నయు
వేణీ మూలంబునందుఁ వెలయగ, బింఛం
బాణీ ముత్యము ముక్కున
నాణెముగాఁ దాల్చు లోక నాథుడ! కృ. 16

క. మడుగుకు జని కాళీయుని
పడగలపై భరతశాస్త్ర పద్ధతి వెలయన్
గడు వేడుకతో నాడెడు
నడుగులు నా మదిని దలఁతు నచ్యుత! కృ. 17

క. బృందా వనమున బ్రహ్మా
నందార్భక! మూర్తి వేణు నాదము నీవా
మందార మూలమున గో
విందా! పూరింతువౌర! వేడుక కృ. 18

క. వారిజనేత్రులు యమునా
వారిని జలకంబులాడ వచ్చిన నీవా
చీరలు మ్రుచ్చిలి తెచ్చితి !
నేరుపురా! ఇదియు నీకు! నీతియె కృ. 19

క. దేవేంద్రుఁ డలుక తోడను
వావిరిగా రాళ్ళవాన! వడి గురియింపన్
గోవర్ధనగిరి యెత్తితి,
గోకుల గోపకుల గాచు కొఱకై కృ. 20

క. అండజ వాహన వినుబ్ర
హ్మాండంబును బంతులట్లు, యాడెడు నీవా,
కొండల నెత్తితి వందురు
కొండిక పనిగాక! దొడ్డకొండా! కృ. 21

క. అంసాలంబిత కుండల
కంసాంతక! నీవు ద్వారకా పురిలోనన్
సంసారి రీతినుండి ప్ర
శంసార్హుండవైతి వహహా జగతినిఁ కృ. 22

క. పదియారు వేల నూర్వురు
సుదతులు నెనమండ్రు నీకు సొంపుగ, భార్యల్
విదితంబుగ బహు రూపుల
వదలక రమియింతు వౌర, వసుధను కృ. 23

క. అంగన పనుపున దోవతి
కొంగున నటుకులను ముడుచు, కొని వచ్చిననా
సంగతి విని దయ నొసగితి
రంగుగ సంపదలు లోకరక్షా! కృ. 24

క. హా! వసుదేవ కుమారక
కావుము నా మానమనుచుఁ గామిని వేఁడన్

ఆవనజాక్షికి నిచ్చి
శ్రీవర ! అక్షయ మటంచుఁ జీరలు కృ. 25

క. శుభ్రమగు పాంచజన్యము
నభ్రంకషమగుచు మ్రోఁగ, నావహ భూమిన్
విభ్రమములగు దనుజ సుతా
గర్భంబులు పగులఁ జేయు, ఘనుడవు కృ. 26

క. జయమును విజయున కియ్యవె!
హయముల ములుకోల మోపి, యదలించి మహా
రయమున నొప్పవె తేరున ?
భయమున రిపుసేన విఱిగి, పారగఁ కృ. 27

క. దుర్జనులగు నృప సంఘము
నిర్జింపఁగఁ దలచి నీవు నిఖిలాధారా !
దుర్జనులను వధియింపను
నర్జునురథ చోదకుండ, వైతివి కృ. 28

క. శక్రసుతు గాచుకొఱకై
చక్రము. చేపట్టి భీష్ముఁ జంపగఁ జనునీ,
విక్రమ మేమని పొగడుదు
నక్రగ్రహ! సర్వలోక నాయక కృ. 29

క. దివిజేంద్ర సుతుని జంపియు
రవిసుతు రక్షించినావు రఘురాముడవై
దివిజేంద్ర సుతునిఁ గాచియు
రవిసుతుఁ బరిమార్చితౌర, రణమున కృ. 30

క. దుర్భర బాణము రాఁగా
గర్భములోనుండి "యభవ! గావు" మటన్నన్,
నిర్భర కృప రక్షించితి
నర్భకు నభిమన్యు సుతుని, నచ్యుత కృ. 31

క. గిరులందు మేరు వౌదువు
సురులందున నింద్రుడౌదు! చుక్కలలోనన్
బరమాత్మ చంద్రుడౌదువు,
నరులందున నృపతివౌదువనయము కృ, 32

క. చుక్కల నెన్నఁగ వచ్చును
గ్రక్కున భూరేణువులను గణుతింప నగున్ ,
జొక్కవు నీ గుణజాలము
నక్కజ మగులెక్క పెట్ట, నజునకు కృ. 33

క. కుక్షిని నిఖల జగంబులు
నిక్షేపముఁ జేసి ప్రళయ, నీరధినడుమన్
రక్షక! వటపత్రముపై
దక్షతఁ బవళించినట్టి, ధన్యుఁడ, కృ. 34

క. విశ్వోత్పత్తికి బ్రహ్మవు
విశ్వము రక్షింపఁ దలఁచి విష్ణుఁడ వనగా
విశ్వముఁ జెఱుపను హరుఁడవు,
విశ్వాత్మక ,నీవె యగుచు వెలయగ కృ. 35

క. అగణిత వైభవ, కేశవ!
నగధర వనమాలి యాదినారాయణ యో
భగవంతుఁడ! శ్రీమంతుఁడ!
జగధీశ్వర! శరణు శరణు శరణము కృ. 36

క. మగమీనమవై జలధిని
బగతుని సోమకునిఁ జంపి, పద్మభవునకున్
నిగమములు దెచ్చి యిచ్చితి
సుగుణాకర! మమ్ముఁ గరుణ జూడుము కృ. 37

క. అందఱు సురలును దనుజులు
పొందుగ క్షీరాబ్ధిఁ దఱచు బొలుపుననీవా

నందముగఁ గూర్మరూపున
మందరగిరి యెత్తితౌర మాధవ కృ. 38

క. ఆదివరాహంబు నీవయి
యాదనుజ హిరణ్యనేత్రుఁ, హతుఁ జేసితగన్
మోదమున సురలు పొగడఁగ
మేదిని గిరి గొడుగునెత్తి మెఱసితి కృ. 39

క. కెరలి యరచేతిఁ గంటము
నరుదుగ వేయుటయు, వెడలియసు రేశ్వరునిన్
ఉరమును జీరి వధించిన
నరహరి రూపావతార నగధర కృ. 40

క. వడుగవువై మూఁడడుగుల
నడిగితివా బలిని భళిర, యఖిల జగంబుల్
తొడిగితివి నీదు మేనునఁ
గడు చిత్రము నీ చరిత్ర, ఘనుఁడవు కృ. 41

క. ఇరువదొకమార్లు నృపతుల
శిరముల, ఖండించి తౌర, చేగొడ్డంటన్
ధరఁగశ్యపునకు నిచ్చియుఁ
బరగవె జమదగ్ని రామ, భద్రుఁడ కృ. 42

క. దశకంఠునిఁ బరిమార్చియుఁ
గుశలముతో సీతదెచ్చి కొనియు, నయోధ్య
న్విశదముగఁ గీర్తినేలిన
దశరథ రామావతార! ధన్యుఁడ కృ. 43

క. ఘనులగు ధేనుక ముష్టిక
దనుజులఁ జెండాడితౌర తగు భుజశక్తిన్
అనఘాత్మ! రేవతీపతి
వనగా బలరామరామూర్తివౌగద కృ. 44

క. త్రిపురాసుర భార్యల నతి
నిపుణతతో వ్రతముచేత, సలిపిన కీర్తుల్
కృపగల రాజవు భళిరే!
కపటపు బౌద్ధావతార, ఘనుఁడవు కృ. 45

క. వలపుల తేజీ నెక్కియు
నిలపై ధర్మంబు నిలుప హీనుల ద్రుంపన్,
కలియుగము తుదిని వేడుకఁ
గలికివిగా నున్న లోకకర్తవు కృ. 46

క. వనజాక్షు! భక్తవత్సల!
ఘనులగు త్రైమూర్తులందు, గరుణానిధివై
కన నీ సద్గుణ జాలము
సనకాది మునీంద్రు లెన్నఁ జాలరు కృ. 47

క. అపరాధ సహస్రంబుల
నపరిమితములైనఁ యఘము లనిశము నేనున్,
గపటాత్ముఁడనై చేసితిఁ
జపలుని ననుఁగావు శేష శాయివి కృ. 48

క. నరపశుఁడ మూఢ చిత్తుఁడ
దురితాంధుఁడ మిగుల: దోషకుండనునీ,
గుఱు తెఱుఁగ నెంతవాఁడను
హరి నీవే ప్రాపు దాపు వౌదువు కృ. 49

క. పంచేంద్రియ మార్గంబులఁ
గొంచెపు బుద్ధినిఁ జరించి, కొన్ని దినంబుల్
ఇంచుక సజ్జన సంగతి
నించుక మిమ్మెఱిగినాడ, నిప్పుడె కృ. 50

క. దుష్టుఁడ దురాచారుఁడ
దుష్ట చరిత్రుఁడను జాల, దుర్బుద్ధిని నే

నిష్ట నినుఁ గొల్వ నేరను
గష్టుఁడ ననుగావు కావు, కరుణను కృ. 51

క. కుంభీంద్ర వరద! కేశవ
జంభాసుర వైరి! దివిజ సన్నుత చరితా
అంభోజనేత్ర! జలనిధి
గంభీరా! నన్ను గావు కరుణను కృ. 52

క. దిక్కెవ్వరు ప్రహ్లాదుకు ?
దిక్కెవ్వరు పాండుసుతుల? దీనుల కెపుడున్
దిక్కెవ్వర య్యహల్యకు,
దిక్కెవ్వరు నీవె నాకు దిక్కవు కృ. 53

క. హరి నీవె దిక్కు నాకును
సిరితో నేతెంచి మకరి, శిక్షించి దయన్ ,
పరమేష్ఠి, సురలు. పొఁగడఁగ
కరిగాచిన రీతి నన్నుఁ, గావుము కృ. 54

క. పురుషోత్తమ! లక్ష్మీపతి!
సరసిజ గర్భాది మాని, సన్నుత చరితా!
మురభంజన, సుర రంజన!
వరదుఁడవగు నాకు భక్త, వత్సల! కృ. 55

క. క్రతువులు, తీర్థాగమములు
వ్రతములు, దానములు సేయ వలెనా? లక్ష్మీ
పతి, మిముఁ దలఁచిన వారికి
నతులిత పుణ్యములు గలుగు, టరుదా? కృ. 56

క. స్తంభమున వెడలి దానవ
డింభకు రక్షించినట్టి తీరున వెలయన్,
అంభోజనేత్ర? జలనిధి
గంభీరుఁడ నన్ను గావు కరుణను కృ. 57

క. శతకోటి భానుతేజా!
యతులిత సద్గుణ గుణాఢ్య! యంబుజనాభా
రతినాథ జనక! లక్ష్మీ
పతి హిత! ననుఁగావు భక్త, వత్సల? కృ. 59

క. మందుఁడ నే దురితాత్ముఁడ
నిందల కొడిగట్టినట్టి నీచుని నన్నున్,
సందేహింపక కావుము
నందుని వరపుత్ర! నిన్ను, నమ్మితిఁ కృ. 60

క. గజరాజ వరద! కేశవ!
త్రిజగత్కల్యాణమూర్తి దేవమురారీ!
భుజగేంద్ర శయన మాధవ
విజయాప్తుఁడ నన్నుఁగావు, వేడుక కృ. 61

క. దుర్మతిని మిగుల దుష్టపుఁ
గర్మములను జేసినట్టి, కష్టుంట నన్నున్
నిర్మలునిఁ జేయవలెని
ష్కర్ముఁడ నిను నమ్మినాను సతతము కృ. 62

క. దుర్వార చక్రకరధర
శర్వాణీ వినుత ప్రణుత! జగదాధారా!
నిర్వాణ నాథ! మాధవ!
సర్వాత్మక! నన్నుగావు సరగునఁ కృ. 63

క. సుత్రామనుత! జనార్ధన
సత్రాజిత్తనయనాథ! సౌందర్యకళా
చిత్రావతార! దేవకి
పుత్రాఁ ననుఁగావు నీకుఁ బుణ్యాము కృ. 64

క. బలమెవ్వఁడు కరిఁబ్రోనను ?
బలమెవ్వడు పాండు సుతుల భార్యను గావన్

బలమెవ్వఁడు రవిసుతునకు!
బలమెవ్వఁడు నాకు నీవు బలహరా కృ. 65

క. వరుసము సోకిన యినుమును
వరుసగ బంగారమైన వడువున జిహ్వన్
హరి! నీనామము సోకిన
సురవందిత! నేను నటుల సులభుఁడ కృ. 66

క. ఒకసారి నీదునామము,
ప్రకటముగా, దలచుఁవారి పాపములెల్లన్
వికటములై తొలఁగుటకును
సకలార్థ, యజామిళుండు సాక్షియాగద కృ. 67

క. హరి సర్వంబునఁ గలఁడని
గరిమను దైత్యుండు పలుకఁ గంబములోనన్
ఇరువొంద వడలు చీల్చవె
శరణన బ్రహ్లాదకుండు సాకిమె కృ. 68

క. భద్రార్చిత పదపద్మను
భద్రాగ్రజ! సర్వలోక పాలన హరి శ్రీ
భద్రాధిప! కేశవ, బల
భద్రానుజ! నన్ను బ్రోవు భవహర కృ. 69

క. ఎటువలెఁగరి మొఱవింటివి?
ఎటువలెఁ బ్రహ్లాదు కభయ, మిచ్చితి కరుణన్?
అటువలె నను రక్షింపుము
కటకట! నిను నమ్మినాఁడ గావుము కృ. 70

క. పటుపట లేటికి జేసెదు
కటకట పరమాత్మ! నీవుఘంటాకర్ణున్
ఎటువలె నిపుణునిఁ జేసితి?
వటువలె రక్షింపుమయ్య యచ్యుత కృ. 71

క. తుంగాధ్వరంబుఁ జేసిన
పురుషులకును వేఱె. పదవి పుట్టుటయేమో
హరి మిముఁదలచిన వారికి
నరుదా? కైవల్య పదవి. యచ్యుత కృ. 72

క. ఓ భవబంధ విమోచన
ఓ భరతాగ్రజ మురారి, యోరఘురామా,
ఓ భక్త కామధేనువ!
ఓ భవహర! ననుఁగావు, మోహరిత కృ. 73

క. ఏ తండ్రి! నిన్ను, కనక కశ్యపు
ఘాతకుడై యతని సుతునిఁ, గరుణను గాచెన్
బ్రీతిసురకోటి పొగడఁగ
నాతండ్రీ! నిన్ను, నేను, నమ్మితి కృ. 74

క. ఓ పుండరీక లోచన!
యోపురుషోత్తమ! ముకుంద! యోగోవిందా!
యోపుర సంహార మిత్రుఁడ?
యోపుణ్యుఁడ! నన్నుఁ బ్రోవుమోహరి కృ. 75

క. ఏ విభుడు ఘోర రణమున
రావణు వధియించి లంక, రాజుగ నిలిపెన్,
భావించి యావిభీషణు
నా విభు నేఁదలతు మదిని, నచ్యుతకృ. 76

క. గ్రహభయ దోషము పొందురు
బహు పీడలు చేర వెఱచుఁ బాయును నఘముల్
ఇహపర ఫలదాయక విను
తహతహ లెక్కడివి నిన్నుఁ దలఁచిన కృ. 77

క. గంగ మొదలైన నదులను
మంగళముగఁ జేయునట్టి మజ్జనమునకున్

సంగతి గలిగిన ఫలములు
రంగుగ మిముఁ దలఁచు సాటిరావుర కృ. 78

క. ఆ దండకా వనంబునఁ
గోదండము దాల్చినట్టి, కోమలమూర్తీ
నాదండఁ గావ రమ్మా
వేదండము గాచినట్టి, వేల్పువు కృ. 79

క. చూపుము నీరూపంబును
బాపుము దుష్కృతములెల్ల, పంకజనాభా
బాపుము నాకును దయతో
శ్రీపతి! నిను నమ్మినాఁడ, సిద్ధము కృ. 80

క. నీ నామము భవహరణము
నీ నామము సర్వసౌఖ్య, నివహాకరంబున్
నీ నామ మమృత పూర్ణము
నీ నామము నేఁ దలంతు, నిత్యము కృ. 81

క. పరులను నడిగిన జనులకుఁ
గుఱుచ సుమీ. ఇది యటంచు, గుఱుతుగ నీవున్.
గుఱుచఁడవై వేడితి మును
ధరఁ బాద త్రయము బలిని, తద్దయు కృ. 82

క. పాలను వెన్నయు మ్రుచ్చిల
ఱోలను మీతల్లి కట్ట రోషము తోడన్
లీలా వినోది వైతివి
బాలుఁడవా! బ్రహ్మఁ గన్నఁ బ్రభుఁడవు కృ. 83

క. రఘునాయక! నీ నామము
లఘుమతితోఁ దలపగలనే లక్ష్మీరమణా
అఘములఁ బాపుము దయతో
రఘురాముఁడవైన లోకరక్షక! కృ. 83

క. అప్పా! ఇత్తువు దయతో
నప్పాలను నతిరసంబు! ననుభవ కాలుల్
యప్పా, ననుఁ గనుఁగొనవే
యప్పా, నను బ్రోవు వేంక, టప్పా! కృ. 85

క. కొంచెపు వాడని మదిలోఁ
నెంచకుమీ వాసుదేవ! నిఖిలాత్మ! హరీ
యంచితముగ నీ కరుణకుఁ
గొంచెము నధికంబు గలదె, కొంతయుఁ గృ. 86

క. వానిరి నీ భక్తులకును
గారవమున నెగ్గు సేయు గర్వాంధులకున్,
దేవ! వధించుట వింటిని
నీ వల్లను భాగ్యమబ్బె నిజముగఁ గృ. 87

క. అయ్యా! పంచేంద్రియములు
నుయ్యాలల నూచినట్టు, లూచఁగ నేరున్
జయ్యనఁ గలఁగుచు నుంటిని
గుయ్యాలింపుము మహాత్మ! గుఱుతుగఁ గృ. 88

క. కంటికి ఱెప్ప విధంబున
బంటుగదా యనుచు నన్నుఁ, బాయక యెపుడున్
జంటను నీ వుండుటచే
కంటకమగు పాపములను, గడచితి కృ. 89

క. యమునకు నీఁక నే వెరువను,
కమలాక్ష జగన్నివాస, కామిత ఫలదా!
విమలమగు నీదు నామము
సమరగ దలచెదను వేగ, సనిశము కృ. 90

క. దండమయా! విశ్వంబర!
దండమయా పుండరీక, దళనేత్ర! హరీ

దండమయా కరుణానిధి,
దండమయా! నీకు నెపుడు, దండము కృ. 91

క. నారాయణ! లక్ష్మీపతి!
నారాయణ! వాసుదేవ! నందకుమారా!
నారాయణ నిను నమ్మితి,
నారాయణ నన్నుఁ బ్రోవు, నగధర కృ. 92

క. తిరుమణి దురిత విదూరము
తిరుమణి సౌభాగ్యకరము, త్రిజగములయందున్,
తిరుమణిఁ బెట్టిన మనుజుఁడు
పరమ పవిత్రుండు, భాగ్యవంతుఁడు కృ. 93

క. దుర్వార చక్రహస్తుఁడ!
శర్వాణీ వినుతనామ! జగదభిరామా!
నిర్వాణనాథ! మాధవ
సర్వాత్మక! ననుఁగావు సరసుడ కృ. 94

క. శ్రీలక్ష్మీనారాయణ!
వాలాయము నిన్నుఁ దలతు వందిత చరణా!
ఏలుము నను నీ బంటుగఁ
జాలఁగ నిను నమ్మినాఁడ సరసుడ కృ. 95

క. శ్రీధర! మాధవ యచ్యుత
భూధర! పురుహూత వినుత, పురుషోత్తమ!
పాద యుగళమెప్పుడు
మోదముతో నమ్మినాఁడ ముద్దుల కృ. 96

క. శిరమున రత్న కిరీటము
కరయుగమున శంఖ చక్ర, ఘన భూషణముల్
ఉరమున వజ్రపుఁ బతకము
సిరినాయక! యమరవినుత, శ్రీహరి కృ. 97

క. అందెలు పాదములందున
సుందరముగ నుంచినావు, సొంపలరంగా,
మందరధర! ముని సన్నుత !
నందుని వరపుత్ర నిన్ను నమ్మితి కృ. 98

క. కందర్పకోటి సుందర !
మంథరధర భానుతేజ మధుసూదన రూపా
సుందర విగ్రహా మునిగణ
వందిత మిము దలఁతు, భక్త వత్సల కృ. 99


క. గోపాల! దొంగ! మురహార!
పాపాలను పాఱఁద్రోలు, ప్రభుఁడవు నీవే
గోపాలమూర్తి! దయతో
నాపాలిట గలిగి బ్రోవు నమ్మితిఁ కృ. 100

క. అనుదినము కృష్ణ శతకము
వినినఁ పఠించినను ముక్తి వేడుక గలుగున్
ధన ధాన్యము గోగణములు
తనయులు నభివృద్ధిఁ బొందుఁ దద్దయుఁ కృ. 101

క. భారద్వాజ సగోత్రుఁడ
గారవమున గంగమాంబ, కరుణా సుతుఁడన్
పేరు నృసింహాహ్వాయుఁడను
శ్రీరమణా! నన్నుఁగావు, సృష్టినిఁ కృ. 102

కృష్ణ శతకము
సంపూర్ణము.

శ్రీ సూర్యరత్న ఆర్ట్ ప్రింటర్స్ కోటగుమ్మం రాజమండ్రి-1


C. Sharma.